
సూర్య
ప్రేటి దినపత్రిక
గుంటూరు పల్నాడు
www.suryaa.com
గురువారం 25 డిసెంబర్ 2025 - పేజీలు 9





# ఇచ్చిన మాట కోసం
# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పటం పర్యటన



- వృద్ధురాలు ఇండ్ల నాగేశ్వరమ్మ ఇంటికి పవన్ కళ్యాణ్
- అండగా ఉంటానని భరోసా - రూ.50వేల ఆర్థిక సాయం
- వృద్ధురాలి మనమడి చదువుకు రూ. లక్ష అందజేత
- వృద్ధురాలు నాగేశ్వరమ్మ పోషణకు తన జీతం నుంచి ప్రతినెలా రూ.5 వేలు ఇస్తానని మాట ఇచ్చిన పవన్ కళ్యాణ్

మంగళగిరి, మేజర్ న్యూస్: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఇప్పటంలో బుధవారం పర్యటించారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణ పేరుతో ఇప్పటం గ్రామంలో జనసేన కార్యకర్తలకు చెందిన ఇళ్లు కూల్చివేశారు. జనసేన ఆవిర్భావ సభకు స్థానిక రైతులు భూములు ఇచ్చారనే కక్షతోనే ఇలా చేశారనే ఆరోపణలు లేకపోలేదు. అప్పట్లో జనసేనాని పవన్ కళ్యాణ్ ఇప్పటం గ్రామంలో పర్యటించి బాధితులకు ధైర్యం చెప్పారు. ఈ క్రమంలో ఎన్నికల్లో గెలిచాక మళ్ళీ ఇప్పటం గ్రామానికి రావాలని ఇండ్ల నాగేశ్వరమ్మ అనే వృద్ధురాలు పవన్ కళ్యాణ్ ను కోరింది. ఆమెకు ఇచ్చిన మాట కోసం పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం హోదాలో ఇప్పటం గ్రామంలో పర్యటించారు.


2 లో



అమ్మా నీ పెద్ద కొడుకుని వచ్చా... బాగున్నావా... నీ ఆరోగ్యం ఎలా ఉంది... నాలుగు రోజులుగా నిన్ను చూసేందుకు వద్దామంటే అధికారిక కార్యక్రమాల వల్ల వీలుపడలేదు... గతంలో నీకిచ్చిన మాట కోసం ఈరోజు పనులన్నీ వాయిదా వేసుకుని నీకోసం వచ్చా... అంటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పటం గ్రామానికి చెందిన వృద్ధురాలు ఇండ్ల నాగేశ్వరమ్మ ను ఆప్యాయంగా అక్కున చేర్చుకుని పలకరించారు.

# శత వసంతాలకు పైబడిన..
# ఆధ్యాత్మిక శోభ

- క్రిస్మస్ సంబరాలకు సిద్ధమైన ప్రాశస్త్యం కలిగిన చర్చిలు
- చర్చిలు ప్రార్థనలు చేసే భవనాలు మాత్రమే కాదు. విశ్వాసం, చరిత్రకు తార్కాణాలు
- విద్యుత్ దీపాలు, స్టార్లు, క్రిస్మస్ ట్రీలతో దేదీప్యమానంగా వెలుగులీనుతున్న మందిరాలు





**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లాలో ప్రత్యేక ప్రాశస్త్యం కలిగిన అనేక చర్చి లు ఉన్నాయి. చర్చిలు ప్రార్థనలు చేసే భవనాలు మాత్రమే కాదు. విశ్వాసం, చరిత్ర కలిసిన స్థలాలు. బ్రిటిష్ కాలం నాటి ప్రతి క్రైస్తవ ప్రార్థన మందిర నిర్మాణానికి ఒక చరిత్ర ఉంటుంది. . ఈ చర్చిలకు సంబంధించిన విషయాలు ఆసక్తికరంగానే కాక చారిత్రక ఆనవాళ్లుగా, అలనాటి సంస్కృతికి తార్కాణాలుగా, నిర్మాణానికి శాశ్వత చిహ్నాలుగా భాసిల్లుతున్నాయి. శతవసంతాలకు పైబడినా చెక్కుచెదరని ఠీవితో దేదీప్యమానంగా వెలుగునీలుతూ ఆధ్యాత్మిక శోభను వెదజల్లుతున్నాయి. భారీ 130 ఏళ్ల చరిత్ర కలిగిన బాప్టిస్ట్ చర్చ్‌బ్రిటిష్ కాలం నాటి క్రైస్తవ మిషనరీ రెవరెండ్ డాక్టర్ విలియం ఎడ్వర్డ్ బాగ్స్ దొర పట్టణములో 1894లో బాప్టిస్ట్ చర్చిని ప్రారంభించారు. 1994లో 100 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ మందిరానికి బాగ్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి అని పున‘ నామకరణం చేశారు సంఘ పెద్దలు. ప్రస్తుతం 130 ఏళ్లు చరిత్ర కలిగిన పాత మందిరంను అలాగే ఉంచి నూతన హంగులతో ఆధునిక చర్చిని క్రైస్తవ సోదరులు నిర్మించుకున్నారు. 1903లో ప్రారంభమైన అంతోనీ దేవాలయం. ముప్పాళ్ళ మండల పరిధిలోని తురకపాలెం గ్రామంలో 1903లో రెవరెండ్ బాడ్స్ స్వాముల వారిచే పునాది వేయబడింది. ఏడాది అనంతరం జోసెఫ్ స్వాముల వారి హయాంలో పూర్తి చేసుకోవడం జరిగింది. ప్రతి ఏడాది జనవరి 17న ఆలయ వార్షిక వేడుకలు, గ్రామోత్సవం అద్భుతంగా జరుగుతుంది. దేశ విదేశాల నుంచి గ్రామస్తులు చేరుకొని పండుగలో భాగస్వామ్యం అవుతారు. శత వసంతాల వేడుకలు పూర్తి చేసుకున్న లూథరన్ చర్చ్ సత్తెనపల్లి పట్టణంలోని లూథరన్ చర్చ్ ఇటీవలే శత వసంతాల వేడుకలను పూర్తిచేసుకుంది. 1925లో రెవరెండ్ డాక్టర్ రస్సెల్ పింక్ అనే దొర ఈ చర్చి నిర్మాణాన్ని ప్రారంభించారని శిలాఫలకం ఆధారంగా నిలిచింది. వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఈ మందిర నిర్మాణం నేటికీ చెక్కుచెదరలేదు. బ్రిటిష్ కాలం నాటి ఈ కట్టడం నేటితరం ఇంజనీర్లకు స్ఫూర్తి గా నిలిచింది. భారీ ఎత్తు వెడల్పుతోపటిష్ట నిర్మాణ రహస్యం. సత్తెనపల్లి నియోజకవర్గంలోని ముప్పాళ్ళ మండలంలోని తురకపాలెం గ్రామంలోని అంతోని

2 లో

## విద్యా ప్రమాణాలు మెరుగుకు
# మన బడి - మన బాధ్యత

- జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా



గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్ : పాఠశాల విద్యా ప్రమాణాలు మెరుగుకు గుంటూరు జిల్లా యంత్రాంగం వినూత్న కార్యక్రమం ప్రారంభించింది. ముఖ్యంగా తొమ్మిది, పదవ తరగతి విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి, ఉన్నత విద్యా, ఉద్యోగ అవకాశాలు పట్ల అవగాహన కల్పించడం తద్వారా పది పరీక్షలలో శత శాతం ఫలితాలు సాధించడం లక్ష్యంగా “మన బడి - మన బాధ్యత“ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ మేరకు జిల్లాలో గల 185 ఉన్నత పాఠశాలలకు జిల్లా అధికారులను ప్రత్యేక

2 లో

## స్థానిక సమస్యలపై తక్షణ స్పందనకు
# పురమిత్ర యాప్‌ని వినియోగించుకోండి

- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ : గుంటూరు నగర ప్రజలు తమ స్థానిక సమస్యలపై తక్షణ స్పందనకు పురమిత్ర యాప్ ని వినియోగించుకోవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆర్టీసి కాలనీ, ఐపిడి కాలనీ, ఎల్ఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి పిజిఆర్ఎస్, డివైసిలో అందిన ఫిర్యాదులను, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేసి, ప్రజలతో పురమిత్ర యాప్ ని డౌన్లోడ్ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పురమిత్ర యాప్ ద్వారా 122 రకాల పురపాలక సేవలు, గ్రీవెన్స్ లు, చెల్లింపులను చేతిలోని ఫోన్ ద్వారానే పొందవచ్చన్నారు

2 లో

# ఇచ్చిన మాట కోసం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పటం పర్యటన

**మొదటి పేజీ తరువాయి**

గత వైయస్సార్సీపి పాలకుల దాష్టికాలకు ఎదురు నిలిచిన వృద్ధురాలు నాగేశ్వరమ్మ నా బిడ్డ పవన్ కళ్యాణ్ వస్తారు... మీ బెదిరింపులకు భయపడం అంటూ అప్పట్లో రోడ్డు ఎక్కారు. ఈ క్రమంలో పవన్ కళ్యాణ్ నాగేశ్వరమ్మ ఇంటికి వెళ్లి కొడుకుగా అండగా నిలుస్తానని మాటిచ్చారు. ఈ నేపథ్యంలో ఇచ్చిన మాట మేరకు బుధవారం పవన్ కళ్యాణ్ నాగేశ్వరమ్మ ఇంటికి వెళ్లి ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులందరినీ పేరుపేరునా పలుకరించారు.

## సంక్రాంతికి చీర, ఖర్చులకు రూ.50 వేల ఆర్థిక సాయం

ఆ ఇంటికి కుమారుడిగా వృద్ధురాలు నాగేశ్వరమ్మ కు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంక్రాంతి పండుగ కానుకగా చీర అందజేశారు. ఖర్చుల నిమిత్తం మరో రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మాటల మధ్యన ఈరోజుకి కుటుంబ పోషణ నిమిత్తం పొలం పనులకు వెళుతున్నట్లు నాగేశ్వరమ్మ చెప్పారు. ప్రతి నెల తన జీతం నుంచి పిఠాపురంలో అనాథ చిన్నారులకు ఇచ్చిన విధంగా రూ 5వేలు పోషణ నిమిత్తం ఇంటికి పంపనున్నట్లు తెలిపారు. దివ్యాంగుడైన నాగేశ్వరమ్మ మనుమడు మనోజ్ సాయి చదువుల నిమిత్తం రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఆమె కుమారుడు కొండయ్య క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3 లక్షలు ఇచ్చారు. నీ ఆరోగ్యం జాగ్రత్త అమ్మ అని చెప్పి అక్కడ నుంచి వెనుదిరిగారు.

## ఆద్యంతం ప్రజల్లో మమేకం
## పూల వర్షంతో స్వాగతం పలికిన స్థానిక ప్రజలు

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇప్పటం వస్తున్నారని తెలుసుకున్న ప్రజలు దారి పొడవునా ఘన స్వాగతం పలికారు. వలన కొండ ఇప్పటం గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా నిలబడి హారతులు పడుతూ, పూల వర్షం కురిపించారు. ఇప్పటినుంచి తిరుగు ప్రయాణంలో పవన్ కళ్యాణ్ ప్రజలతో మమేకమయ్యారు. పూల తోటల్లో పనిచేస్తున్న కూలీలను పలకరించారు. రోజుకు ఎన్ని పూలు కోస్తారని ఆరా తీశారు. ఒక్కొక్కరు రెండు కేజీల నుంచి మూడు కేజీల పూలు కోస్తామని తెలిపారు. కొలనుకొండలో నిర్మల అనే మహిళ తమ నివాస గృహం వద్ద కరెంట్ పోల్ కావాలని అడగగా తక్షణం ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. పింఛన్లు ఇప్పించాలని



పలువురు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు విన్నవించగా విజ్ఞప్తులను పరిష్కరించే బాధ్యతను పేషీ అధికారులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, పార్టీ నాయకులు గంజి చిరంజీవి, సబ్ కలెక్టర్ సంజనా సిన్హా తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

## – నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ




**మంగళగిరి,మేజర్ న్యూస్:** విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. బుధవారం మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి ఆత్మకూరు వీ.జే. డిగ్రీ కళాశాలలో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ... విద్యార్థులు డ్రగ్స్ , గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలకు బానిస కావద్దన్నారు. డ్రగ్స్ అలవాటుగా మారితే వారి జీవితాలు నాశనం అవుతా యన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, విద్యార్థు లను చైతన్యవంతుల్ని చేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామని డీఎస్పీ తెలిపారు. గంజాయి, డ్రగ్స్ సేవించినా,సరఫరా చేసిన అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, కళాశాల లెక్చరర్లు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్.పి

**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్:** తుళ్లూరు మండలం వెంకటపాలెంలో గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నిమిత్తం పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ తో కలిసి జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పరిశీలించారు. వెంకటపాలెంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి జయంతి సందర్భంగా అటల్ స్మృతి వనంను ప్రారంభించనున్నారు. స్మృతి వనంలో అటల్ బిహారీ వాజ్ పేయి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. గురువారం ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్ర శేఖర్, రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, సత్య కుమార్ యాదవ్, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నారు. ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.డి.ఎ అదనపు కమిషనర్ భరత్ తేజ, అదనపు ఎస్పీలు హనుమంతు, ఏ.టి.వి రవి కుమార్, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, రహదారులు భవనాలు శాఖ పర్యవేక్షక ఇంజనీర్



శ్రీనివాస మూర్తి, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, తహసిల్దార్ హరి బాబు, సి.పి.డి.సి.ఎల్ పర్యవేక్షక ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సమస్యలపై తక్షణ స్పందనకు పురమిత్ర యాప్‌ని వినియోగించుకోండి

**మొదటి పేజీ తరువాయి**

. కార్యాలయాల చుట్టూ తిరగకుండా సేవలను పొందేలా, అధికారులు జవాబుదారీతనంతో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ యాప్ ని రూపొందించిందన్నారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు వాటి పరిష్కార స్తితిని తెలుసుకోవానికి ట్రాకింగ్ ఉండడం వలన ప్రజలకు తమ సమస్య, లేదా తమ దరఖాస్తు స్థితి తెలుసుకోవచ్చన్నారు. ప్రతి దరఖాస్తు పరిష్కారానికి నిర్దేశిత గడువు ఉన్నందున సిబ్బంది కూడా భాధ్యతగా వ్యావహరిస్తారని పేర్కొన్నారు. ఐపిడి కాలనీ ఉత్తరవారి వీధిలో పందుల సమస్యపై అందిన ఫిర్యాదుని పరిశీలించి, పందులను పెంచే వారికి నోటీసులు ఇచ్చి, వాటికి స్పందించకుంటే జిఎంసి నుండి తగు చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులను, ఎల్ఆర్ కాలనీలో ఫిర్యాదుని



పరిశీలించి, ప్రజల రాకపోకలకు వీలుగ్ రోడ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే సదరు ప్రాంతంలో కమర్షియల్ సంస్థల ఆస్తిపన్నుని పరిశీలించి, లేకుంటే అపరాధ రుసుం విధించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆర్టీసి కాలనీలో ఆక్యుపెన్సీ కోసం అందిన దరఖాస్తు చేసుకున్న బహుళ అంతస్తు భవనాన్ని నిర్దేశిత ప్లాన్ మేరకు కొలతలు పరిశీలించారు. ఈ పర్యటన డిఈఈ శ్రీనివాస్, కార్పొరేటర్ రంగారెడ్డి, ఎస్ఎస్ లు సాంబయ్య, అయూబ్ ఖాన్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



## శత వసంతాలకు పైబడిన..
# ఆధ్యాత్మిక శోభ

**మొదటి పేజీ తరువాయి**

దేవాలయ నిర్మాణం సుమారు 150 అడుగుల ఎత్తు 45 అడుగుల వెడల్పుతో నిర్మితమై ఉంది. సత్తెనపల్లి పట్టణంలోని లూథరన్ చర్చ్ 100 అడుగుల ఎత్తు, 60 అడుగుల వెడల్పుతో ఒకేసారి 400 మంది కూర్చునే అంత విశాలంగా నిర్మించబడింది. ఈ మహా కట్టడాలు దూరం నుంచే సందర్శకులను ఆకర్షిస్థాయి. పిల్లర్లు, భీములు లేకుండానే ఇంత భారీ నిర్మాణాన్ని నిలబెట్టడం అప్పటి నిపుణుల అసాధారణ ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ చర్చి ల నిర్మాణంలో రాతి, దంగు సున్నం తప్ప మరో పదార్థం ఉపయోగించలేదు. శిఖరం, గోడలు, అంతర్గత నిర్మాణం వందేళ్లు గడిచినా ఎలాంటి నష్టం లేకుండా నిలిచాయి..

## విద్యా ప్రమాణాలు మెరుగుకు
# మన బడి – మన బాధ్యత

**మొదటి పేజీ తరువాయి**

అధికారులుగా నియమించి ఆయా పాఠశాలల పర్యవేక్షణ చేయుటకు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. తొమ్మిది, పది విద్యార్థుల్లో మానసిక ఆందోళన తగ్గించడం, చదువు పట్ల ఏకాగ్రత కలిగించడం, విద్యార్థులు ఏ సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారో గుర్తించి వాటిలో మంచి తర్ఫీదు ఇవ్వడం, అందులో ఉన్న భయం పోగొట్టడం, అదే సబ్జెక్టులో ఉన్నత విద్య అభ్యసించి అందులో నిపుణులుగా తయారు అయ్యే విధంగా మలచడం వంటి అంశాలు పట్ల దృష్టి సారించారు. విద్యార్థులకు ప్రత్యేక అధికారులు మార్గదర్శిగా, కౌన్సిలింగ్ అందించడం చేస్తారు. వివిధ రంగాల్లో విజయాలు సాధించిన వ్యక్తుల జీవిత చరిత్రలు తెలియజేస్తూ ప్రేరణ కలిగించడం జరుగుతుంది. జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ విద్యార్థులు సరైన అవగాహన లేక అనేక అవకాశాలు చేజార్చుకుంటున్నారన్నారు. విద్యార్థులకు మంచి మార్గదర్శకత్వం, సూచనలు, సలహాలు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు అందించడం వలన భవిష్యత్తుకు గట్టి పునాది పడుతుందన్నారు. అందుకే "మన బడి – మన బాధ్యత" కార్యక్రమాన్ని అమలు చేస్తూ జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించామని అన్నారు. అధికారులు స్వీయ అనుభవాలు కూడా విద్యార్థులకు ఎంతో ఉపయోగ పడుతుందని చెప్పారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంచడం, మానసిక స్థైర్యం తీసుకురావడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# డిసెంబర్ 27న చలో రాజభవన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి




**దుగ్గిరాల ,మేజర్ న్యూస్** ,దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో పని హక్కును కాలరా శి గాంధీ పేరును తొలగించి జిరాంజీ పేరుతో చేసిన చట్టాన్ని రద్దు చేయాలని ,2005 చట్టాన్ని బలోపేతం చేసి అమలు చేయాలని కోరుతూ ఈనెల 27న తలపెట్టిన చలో రాజభవన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గ్రామంలో పెద్ద ఎత్తున కరపత్రాలు పంపిణీ చేశారు .జి రాంజీ పేరుతో తెచ్చిన చట్టం జీవో కరపత్రాలను దహనం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా వ్యవసాయ కార్మికులకే కాకుండా చిన్న సన్న కారు రైతులకు లక్షల ఎకరాల పేదల భూమిని అభివృద్ధి చేసి వేలాదిమంది యువకులకు ఉద్యోగాలు కల్పించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మార్చటం దుర్మార్గమన్నారు . పేదలకు ఆత్మస్థైర్యాన్ని ఆర్థిక స్వాలంబనను,. భూస్వామ్య దౌర్జన్యాలను ఎదుర్కొనే శక్తినిచ్చిన జాతిపిత మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టాన్ని ఎన్డీఏ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు .గుండెకాయ లాంటి హక్కును కాలరాశి మో0 డంలోని తలకాయ లాగా జి. రాంజీ పేరుతో చట్టాన్ని తెచ్చి కోట్లాదిమంది పేదలకు అన్యాయం చేసిందని విమర్శించారు .బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీవ్రమైన ద్రోహం చేసిందన్నారు .రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం.తో పాటు వైసీపీ ఎంపీలు కలసికట్టుగా వెన్నుపోటు పొడిచిన బిజెపి పార్టీ తెచ్చిన కొత్త చట్టానికి ఓట్లు వేసి రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని అప్పారావు విమర్శించారు. . జాతిపిత మహాత్మా గాంధీ పేరును తొలగించి గాంధీజీని చంపిన గాడ్సే పేరు వచ్చేలా జీ రాం జి గా పేరు మార్చారన్నారు . 2005లో చేసిన చట్టాన్ని బలపరిచి ,కోట్లాదిమందికి గ్యారెంటీ హక్కును రద్దు చేస్తున్న 20 25 చట్టాన్ని రద్దు చేయాలని డిసెంబర్ 27వ తేదీన తలపెట్టిన చలో రాజ్ భవన్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున జయప్రదం చేయాలని అప్పారావు.పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కార్మికులు, రైతాంగం, కౌ లు రైతులు ,ఉపాధి సిబ్బంది ,ప్రజలు ,ప్రజాస్వామిక వాదులు ,తరలివచ్చి ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని అప్పారావు కోరారు .కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, ఎం కోటేశ్వరరావు ,కే ధర్మయ్య ,కె కోటేశ్వరరావు, ఆర్ పాప, ఎం శశి ,వి శ్రీనివాసరావు, ఎం నరేంద్ర ,జి శ్రీనివాసరావు, కె శ్రీనివాసరావు ,డి నాగేశ్వరరావు ,ఎస్ నాగేంద్ర ,ఆర్ భూషణం తదితరులు పాల్గొన్నారు.

## గ్రీటింగ్ కార్డులు తయారుచేసిన చైల్డ్ ఆర్టిస్టులు



**తెనాలి, మేజర్ న్యూస్** చిత్రలేఖనోపాధ్యాయులు బెల్లంకొండ వెంకట్ ఆధ్వర్యంలో హెచ్ఎం పఠాన్ కరిముల్లా పర్యవేక్షణలో విద్యార్థులు 100 మందికి పైగా పాల్గొని గ్రీటింగ్స్ తయారు చేశారు. హెచ్ఎం కరీముల్లా గారు క్రిస్మస్ సందర్భంగా శుభాకాంక్షలు అందజేశారు విద్యార్థులను అభినందించారు. బెల్లంకొండ వెంకట్ మాట్లాడుతూ బొమ్మలంటే పిల్లలకు ప్రాణమని ఆ బొమ్మలను పెన్సిల్, స్కెచ్ పెన్సిల్, పెయింటింగ్స్ తో వేస్తే అద్భుతాలు సృష్టిస్తామని విద్యార్థులు నిరూపించారు. బొమ్మలు ప్రకృతి దృశ్యాలు దేశ నాయకులు స్వచ్ఛభారత్ దేవుళ్ళ బొమ్మలతో పోస్ట్ కార్డు పై గీసి అందరి మనసులను ఆకట్టుకున్నారు. దాదాపు 1,000 కి పైగా కార్డులు గీసి వాళ్ళ సృజనాత్మకతను చాటుకున్నారు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రాలు సైతం అద్భుతంగా చిత్రించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాలపర్తి శ్రీనివాసరావు, సోమశేఖర్, కృష్ణజ, శివకుమారి, స్వప్న, వెంకటేశ్వర్లు, రమేష్,హబీబ్ బాషా, సునీల్, శ్రావణి,బాలమ్మ, శివ పార్వతి, రజియా, కాత్యాయని తదితర ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# పీ.ఎం.వీ.బీ.ఆర్.వై ప్రయోజనాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలి



**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్:** జిల్లాలోని వ్యాపార , పారిశ్రామిక రంగానికి చెందిన ఉద్యోగులు, యజమానులకు ప్రధాన మంత్రి విక్షిత్ భారత్ రోజ్ ఘర్ యోజన పథకం (పీ.ఎం.వీ.బీ.ఆర్.వై ) ప్రయోజనాలు అందించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రధాన మంత్రి విక్షిత్ భారత్ రోజ్ ఘర్ యోజన పథకం పై ఉద్యోగుల భవిష్యనిది సంస్థ, కార్మిక శాఖ, పరిశ్రమల శాఖ, ఈఎస్ఐ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సేవ, తయారీ రంగ పరిశ్రమలలో ఉద్యోగాల సృష్టిని పెంచేందుకు గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి విక్షిత్ భారత్ రోజ్ ఘర్ యోజన పథకం ద్వారా కార్మికులకు యజమానులకు ప్రత్యేక ప్రయోజనాలను అందిస్తున్నారని తెలిపారు. ఈ.పీ.ఎఫ్ లో నమోదు చేసుకున్న మొదటిసారి ఉద్యోగులకు రూ.15,000/- వరకు ప్రోత్సాహకం రెండు విడతల్లో అందిస్తారన్నారు, లక్ష వరకు స్థూల జీతం ఉన్న ఉద్యోగులందరూ ఈ పథకానికి అర్హత ఉందని చెప్పారు. నూతనంగా ఈ.పీ.ఎఫ్ లో నమోదు చేసిన అదనపు ఉద్యోగికి సేవా రంగ సంస్థలకు రెండు సంవత్సరాల వరకు, తయారీ రంగ సంస్థలకు నాలుగు సంవత్సరాల వరకు ప్రతినెల రూ. 3,000 వరకు ప్రయోజనాలు అందించడం జరుగుతుందని వివరించారు. 2025 ఆగస్టు1వ తేదీ నుండి 2027 జూలై 31వ తేదీ మధ్యకాలంలో నమోదైన ఉద్యోగులకు మాత్రమే ఈ ప్రయోజనాలు అందించడం జరుగుతుందన్నారు. ఈఎస్ఐసీ అమలు చేయబడిన ప్రాంతాల్లో 10 లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులతో ఉన్న ఫ్యాక్టరీలు లేదా సంస్థలకు ఎస్.పీ.ఆర్.ఈ.ఈ - 2025 (యజమానులు మరియు ఉద్యోగుల నమోదును ప్రోత్సహించే పథకం) లో 31 డిసెంబర్ 2025 నాటికి ఇప్పటికీ ఈఎస్ఐసీ లో నమోదు కాని కార్మికులను ఎలాంటి చందాలు, జరిమానాలు లేకుండా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లాలోని సేవ, తయారీ రంగ వ్యాపార సంస్థల యాజమాన్యాలకు పీఎం వీ బీ ఆర్ వై పథకం ప్రయోజనాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగేలా భవిష్యనిది సంస్థ, కార్మిక శాఖ, పరిశ్రమల శాఖ, ఈఎస్ఐ , ఇతర ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఏ గాయత్రి, అసిస్టెంట్ కమిషనర్ కే శ్రీనివాసరావు, అసిస్టెంట్ పిఎఫ్ కమిషనర్ పి గోపాల్ సింగ్, ఎన్ ఫోర్స్ మెంట్ ఆఫీసర్ నాగేశ్వరరావు, ఈఎస్ఐ అధికారి కే చెన్నకేశవులు, ఫ్యాక్టరీస్ శాఖ అధికారి బి శిరీష, ఇండస్ట్రీస్ అధికారి మణికుమారి, ఏపీ ఎఫ్ సి కే ప్రతినిధి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దకూరపాడు, ఖమ్మంపాడు గ్రామాలలో రైతు విజ్ఞాన యాత్ర



**పెదకూరపాడు మేజర్ న్యూస్:**మండల పరిధిలోని పెదకూరపాడు,ఖమ్మంపాడు గ్రామాలలోని రైతులకు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ( ఆత్మ )గుంటూరు వారి సౌజన్యంతో రైతు విజ్ఞాన యాత్ర ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం లాంపారం మరియు జీవ నియంత్రణ ప్రయోగశాల,ఉద్యాన పరిశోధన విభాగం సందర్శించడమైనది శాస్త్రవేత్త శ్రీలత అపరాల పంటలైనటువంటి కంది పెసర మినుము వాణిజ్య పంటలైనటువంటి ప్రత్తి రకాలు ప్రయోగ క్షేత్రాలను గురించి రైతులకు వివరించడం జరిగింది. శాస్త్రవేత్త సతీష్ వర్మ మిరప పంటలో నల్ల,తామర పురుగు నివారణకు జీవన పురుగుమందులైన బవేరియా, బసియాను,వర్టీసీలియం లకాని గురించి వివరించినారు. మిరప శాస్త్రవేత్త శ్రీ నాగేందర్ రెడ్డి మిరపలో తామర పురుగు నివారణకు సమగ్ర సస్యరక్షణ విధానాల గురించి రైతులకు అవగాహన కల్పించినారు. జీవ నియంత్రణ ప్రయోగశాల సహాయ వ్యవసాయ సంచాలకులు సునీత ట్రైకోడెర్మ విరిడి తయారీ మరియు వినియోగం గురించి వివరించినారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి డి క్రిష్ణయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు హనుమా నాయక్, పెదకూరపాడు మండల రైతులు పాల్గొన్నారు.

## రోడ్లపై తిరుగుతున్న గొవులను గోశాలకి తరలించిన జిఎంసి అధికారులు



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** గుంటూరు నగరంలో ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ కి ఆటంకం కల్గిస్తూ, ప్రమాదాలకు కారణంగా ఉంటున్నఆవులను, ఎద్దులను 3 బృందాల ద్వారా గోశాలకు తరలించడం జరుగుతుందని, తరలించిన వాటిని ఎట్టి పరిస్తితుల్లో తిరిగి ఇవ్వబడవని, తరలింపుని అడ్డుకుంటే పోలీసు కేసులు నమోదు చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం ఎల్ఆర్ కాలనీ, ఏటుకూరు రోడ్ ప్రాంతాల్లో రోడ్ల మీద ఉన్న ఆవులను గోశాలకు తరలింపులో కమిషనర్ నేరుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్ల మీద ఆవులు విచ్చలవిడిగా వదులుతున్నారని, దాని వలన రోడ్ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే పలుమార్లు ఆవుల యజమానులకు రోడ్ల మీదకు వదలవద్దని తెలిపినా నిర్లక్ష్యంగా ఉంటున్నారన్నారు. ముద్రలు ఉన్న, పెంపుడు ఆవులైనా రోడ్ మీదకు వస్తే జిఎంసి గోశాలకు తరలిస్తామన్నారు. తరలించిన ఆవులను ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వడం జరగదని స్పష్టం చేశారు. ఆవులను పట్టుకోవడానికి 3 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, బృందాలలో పోలీసులు కూడా ఉంటారన్నారు. ఆవులను పట్టుకోవడంను వీడియో రికార్డింగ్ చేస్తామని, ఎవరైనా అడ్డుకుంటే చట్టపరంగా కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిఎంసి గోశాలలో కూడా అదనపు సిసి కెమెరాలు ఏర్పాటు చేసి, సిబ్బందిని షిఫ్ట్ ల వారీగా పెంచాలని ఎంహెచ్ఓని ఆదేశించారు. గోశాలని ప్రజారోగ్య అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని, తాము కూడా ఆకస్మిక తనిఖీలు చేస్తామని తెలిపారు.

# వక్ఫ్ భూములను పేద ముస్లింలకు ఇళ్ళ స్థలాలుగా ఇవ్వాలి - సిపియం




**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** మంగళగిరి-తాడేపల్లి కార్పోరేషన్ పరిధిలో చినకాకాని సమీపంలో ఉన్న 71.57 ఎకరాల వక్ఫ్ భూమిని పారిశ్రామీక అవసరాలకు కాకుండా కార్పోరేషన్ పరిధిలో వుంటున్న ఇళ్ళు లేని పేద ముస్లింలకు ఇళ్ళస్థలాలుగా ఇవ్వాలని సిపియం జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుందని జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. బుధవారం బ్రాడీపేటలోని సిపియం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ విస్తృత సమావేశంలో ఆమేరకు తీర్మానాన్ని ఆమోదించారు. ఈ సందర్భంగా వై.నేతాజీ మాట్లాడుతూ రాజధాని ప్రాంతానికి ఆనుకుని ఉన్న మంగళగిరి - తాడేపల్లి కార్పోరేషన్ పరిధిలో 20వేల మంది ఇళ్ళు లేని పేదలు ఇళ్ళ స్థలాల కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో దాదాపు 5వేల కుటుంబాలు ముస్లింలు వున్నారు. గత 40ఏళ్ళగా ప్రభుత్వాలు ఏవి అధికారంలో వున్న ఈ ప్రాంతంలో పేదలకు ఇళ్ళస్థలాలు ఇవ్వలేదు.వై.సి.పి ప్రభుత్వ హయాంలో ఈ కార్పోరేషన్ పరిధిలో వున్న పేదలకు రాజధాని ప్రాంతంలో ఇచ్చిన ఇళ్ళ స్థలాలు కోర్టు ఉత్తర్వులతో రద్దుయ్యాయి. గత ఎన్నికల సందర్భంగా పట్టణ ప్రాంత పేదలకు 2 సెంట్లు, ఇళ్ళ స్థలం ఇచ్చి ఇళ్ళు నిర్మిస్తామని కూటమి హామీ ఇచ్చింది. మంగళగిరి - తాడేపల్లి కార్పోరేషన్ పరిధిలోని పేదలు గత నెలలో మంగళగిరిలోని కార్పోరేషన్ కార్యాలయం వద్ద తమకు ఇళ్ళు స్థలాలు కేటాయించాలని కోరుతూ వేలాదిమంది ఆందోళన చేసి ధరఖాస్తులు ఇచ్చారు. ఆ సందర్భంగా అధికారులు ఇళ్ళస్థలాలు ఇచ్చేందుకు భూములు లేవని పేదలను మభ్య పెట్టే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం మంగళగిరి పట్టణానికి సమీపంలో ఉన్న 71.57 ఎకరాల వక్ఫ్ భూమిని రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక అవసరాల కోసం వినియోగించాలని నిర్ణయించినట్లు గుంటూరు జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఇది సరైనది కాదని సిపియం పార్టీ భావిస్తుంది. ఇళ్ళ స్థలాలు ఇచ్చేందుకు అనువుగా ఉండే ఈ వక్ఫ్ భూమిని ముస్లింలోని పేదలకు ఇళ్ళ స్థలాలుగా ఇవ్వాలని, ప్రారిశ్రామిక ప్రాంత అవసరాల కోసం ఇతర ప్రాంతాలలో భూములు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ముస్లిం పెద్దలు కూడా ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని పేద ముస్లింలకు ఆసరగా నిలవాలని కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, ఎమ్.రవి, బి.వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు వి.జవహార్‌లాల్, కె.అజయ్‌కుమార్, ఎస్.ఎస్.చెంగయ్య, పి.కృష్ణ, బి.ముత్యాలరావు, ఎమ్.శివసాంబిరెడ్డి తదితరలు పాల్గొన్నారు.

# ఆహ్లాదభరితంగా మంగళగిరి నియోజకవర్గంలో స్మశాన వాటికలు

❖ మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో స్మశాన వాటికలు అభివృద్ధి

❖ ఆత్మకూరులో మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో నిర్మించిన ఎస్సీ స్మశాన వాటికలను ప్రారంభించిన నాయకులు





**మంగళగిరి మేజర్ న్యూస్ :** మంగళగిరి నియోజకవర్గంలో స్మశాన వాటికలను పూర్తి స్థాయిలో ఆధునీకరించడంతో పాటు అవసరమైన వసతులు కల్పించేందుకు మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో మంగళగిరి మండలం ఆత్మకూరులో మూడున్నర ఎకరాల్లో ఆధునిక వసతులతో నిర్మించిన ఎస్సీ సామాజికవర్గానికి చెందిన మాల, మాదిగ స్మశాన వాటికలను స్థానిక కూటమి నాయకులు బుధవారం ప్రారంభించారు. స్మశాన వాటికలో ప్రహరీ, ప్రార్థన గది, విశ్రాంతి గదులు, స్మశానం లోపల వరకు సీసీ రోడ్డు, పార్కింగ్, నీటి సదుపాయం, మృతుల బంధువులు స్నానం ఆచరించడానికి స్నానపు గదులు, సేద తీరడానికి సిమెంట్ బల్లలు, మరుగుదొడ్లు, పచ్చని గార్డెన్ నిర్మించారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని స్మశాన వాటికి ఆహ్లాదభరితంగా అభివృద్ధి చేసినందుకు మంత్రి నారా లోకేష్‌కు రుణపడి ఉంటామని గ్రామ ప్రజలు తెలిపారు. ఈ సందర్భంగా నందం అబద్దయ్య మాట్లాడుతూ స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్మశానవాటికలను ఆధునికంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల విశ్వాసానికి తగిన విధంగా మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి నారా లోకేష్ కట్టుబడి పనిచేస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తించి వారి సమస్యల పరిష్కారంకు తొలి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ విభాగ నాయకులు కొడాలి విజయ్, ఏపీఐఐసీ డైరెక్టర్ కనికళ్ళ చిరంజీవి, మంగళగిరి మండల పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, మండల పార్టీ ఉపాధ్యక్షులు కొమ్మా సుకుమార్, మంగళగిరి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఎర్రగుంట్ల భాగ్యరావు, గుంటూరు పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు వేమూరి మైనర్ బాబు, తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు తాటి వెంకటరావు, గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు కట్టా కృష్ణ, కొమ్మా లవ్ కుమార్, జొన్నకూటి శ్రీనివాసరావు, మాన్యం సుబ్బారావు, సిపిఐ పార్టీ నాయకులు జాలాది జాన్ బాబు, పంతగాని మరి దాసుగారు, కాంట్రాక్టర్ కిషోర్, లూథరన్ సంఘం పాస్టర్ జొన్నకూటి యేసు రత్నం, నియోకవర్గ పాస్టర్లు పాస్టర్ తిమోతి, రవిప్రకాష్ కుల పెద్దలు జాలాది రత్నం, జాలాది విజయేంద్ర రావు, ధారా గాబ్రియేలు, వేమూరి ఫ్రాన్సిస్, ఎర్రమాల అహరోన్, జంగం బాపయ్య, కొమ్మా జ్యోతి రాజు, సభ్యులు జ్యోతుల అజయ్, జాలాది రాజశేఖర్, వేమూరి నాగరాజు, వేమూరి రాజేష్, ఆర్సీఎం సంఘ పెద్దలు కట్టె పోగు రాంబాబు, బండపల్లి బాపయ్య, పులివర్తి శేషయ్య, పులివర్తి మరియదాసు, కొండమీద సుబ్బారావు, తదితర గ్రామస్తులు వివిధ సంఘాల పాస్టర్లు పాల్గొని జయప్రదం చేశారు.

# ఉద్యోగ, కార్మిక రంగాల ఉద్యమానికి అత్యున్నత సేవలు అందించిన నాయకుడు కామ్రేడ్ వి.సాంబశివరావు




**గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్ :** తొలుత పోస్ట్, టెలిగ్రాఫ్స్ (పి,టి) రంగంలో, ఆ తర్వాత బి.ఎస్.ఎన్.ఎల్ ఉద్యోగుల సంఘంలో వివిధ స్థాయిల్లో నాయకుడుగా పనిచేసి ఇటీవల మరణించిన కామ్రేడ్ వి.సాంబశివరావు రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి అత్యంత ఆదర్శప్రాయమని బి.ఎస్. ఎన్.ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆల్ ఇండియా అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ జే. సంపత్ రావు అన్నారు. బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో వి.సాంబశివరావు సంస్మరణ సభ జరిగింది. ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సి.ఐ.టి.యు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా హాజరైన సంపత్ రావు ప్రసంగిస్తూ టెలికాం ఉద్యోగుల సైద్ధాంతిక స్థాయిని, చైతన్యాన్ని పెంచేందుకు సాంబశివరావు విశేషమైన కృషి చేశారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి తన స్ఫూర్తిదాయక ప్రసంగాలతో బి.ఎస్.ఎన్.ఎల్ ఉద్యోగులను కదిలించి అనేక పోరాటాలు, దేశవ్యాప్త సమ్మెలను విజయవంతం చేయడంలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. టి.వి 9 సి.ఇ.ఓ సాంబశివరావు కుమారుడు వి.రజనికాంత్ మాట్లాడుతూ నిరాడంబరత, సామాజిక సేవ వంటి ఎన్నో విలువలు పాటించిన సాంబశివరావు తండ్రిగా ఎన్నో కీలక సమయాల్లో తనకు సరైన దిశా నిర్దేశం చేశారని అన్నారు. ఆల్ ఇండియా డాట్ అండ్ బి. ఎస్.ఎన్.ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు పి. అశోక్ బాబు మాట్లాడుతూ పోస్టల్, టెలికాం, ఇన్సూరెన్స్ తదితర ఉద్యమాల్లో పాల్గొంటూ ఐక్య ఉద్యమాల పటిష్టతకు సాంబశివరావు చక్కటి కృషి చేశారని అన్నారు. సి.ఐ.టి.యు జిల్లా ట్రెజరర్ గా పలు సంవత్సరాల పాటు పనిచేసి విశాల కార్మికోద్యమానికి, అలాగే వామపక్ష భావాలతో సమాజ శ్రేయస్సుకు పూర్తి కాలం తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. సభలో పాల్గొన్న అనేక సంఘాల నేతలు సాంబశివరావుతో తమకున్న ఉద్యమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్ర మంలో సాంబశివరావు కూతురు ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఇతర కుటుంబ సభ్యులు, వివిధ రంగాల నాయకులు జి.రత్తయ్య, ఎన్.నాగేశ్వరరావు, ఎస్. హనుమంత రెడ్డి, ఏ.వి.శివయ్య, సి.హెచ్.విద్యాసాగర్, వి.వి.కే.సురేష్, సి.హెచ్. వెంకటేశ్వర్లు, బి.లక్ష్మణరావు ఎమ్.శ్రీనివాసరావు, సి. హెచ్.ఇనాక్, కే.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టవివరాలను వెల్లడించిన నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ



**మంగళగిరి మేజర్ న్యూస్ :** పాత కక్షల నేపథ్యంలో తాడేపల్లి మండలం మదర్ థెరిసా కాలనీ సమీపంలోని అంజిరెడ్డి కాలనీ -కొలను కొండ బైపాస్ రోడ్డు మార్గంలోని అరటి తోటలో ఈనెల 18వ తేదీ రాత్రి జరిగిన ఆటో డ్రైవర్ హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. బుధవారం తాడేపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ వీరేంద్రబాబు తో కలసి హత్య కేసు వివరాలను వెల్లడించారు. తాడేపల్లి పట్టణంలోని బ్రహ్మానందపురం చెందిన ఇల్లచెరువు వెంకటరావు (32) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 18వ తేదీ రాత్రి వెంకటరావు తన ఆటోలో మదర్ థెరిసా కాలనీ వైపు వెళు తున్నాడు. అదే సమయంలో అంజిరెడ్డి కాలనీకి చెందిన మల్లినేని సాయి భవాని అలియాస్ సాయి తన జన్మదినోత్సవం సందర్భంగా స్నేహితులైన వేమూరి మహేష్ బాబు అలియాస్ మహి, ఎన్టీఆర్ కట్టకు చెందిన నీరజ్, గిరీష్, ఆదిత్య, నవదీప్ జోసఫ్ లతో రోడ్డు పక్కన బర్త్ డే పార్టీ చేసుకుంటుండగా ఆటో డ్రైవర్ వెంకటరావు తన ఆటోతో తో కట్ కొట్టి ఇంటికి తిరిగి వెళుతున్నాడు. ఈ క్రమంలో స్నేహితులంతా బిగ్గరగా అరచి ఆటో డ్రైవర్ వెంకటరావును ఆపే ప్రయత్నం చేయగా ఆటోలో వేగంగా వెళ్ళిపోయాడు. దీంతో మల్లినేని సాయి భవాని, వేమూరి మహేష్ బాబు లు తమ ద్విచక్ర వాహనంపై వెళ్లి ఆటోను అడ్డగించి ఆటో డ్రైవర్ వెంకటరావుపై దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో వెంకటరావు వారి నుండి తప్పించుకొని సమీపంలోని అరటి తోటలోకి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో తారు రోడ్డుపై రాళ్లగుట్టపై పడవేసి ఉన్న దుప్పట్లో రెండు పెద్ద సిమెంటు రాళ్లు తీసుకువచ్చి వెంకటరావు తలపై మోది హత్య చేసి పరారయ్యారు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాడేపల్లి సిఐ వీరేంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, నార్త్ సబ్ డివిజన్ డిఎస్పి మురళీకృష్ణ పర్యవేక్షణ లో తాడేపల్లి సిఐ వీరేంద్రబాబు, ఎస్సైలు షేక్ ఖాజావలి, ప్రదీప్ వారి సిబ్బంది తో బుధవారం నిందితులను బ్రహ్మానందపురం వద్ద అరెస్టు చేశారు. కాగా హత్య కేసును రోజుల వ్యవధిలో చేధించిన తాడేపల్లి పోలీస్ అధికారులను, సిబ్బందిని డిఎస్పి మురళీకృష్ణ అభినందించి రివార్డులను అందజేశారు.

# నియోజకవర్గ ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు




**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** గురజాల నియోజకవర్గ ప్రజలందరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు. కరుణామయుడు, శాంతి దూత ఏసుప్రభు ఆశీస్సులతోని గురజాల నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, ఆయురారోగ్యాలతో ఎల్లప్పుడూ వెచ్చని ప్రేమతో ఆనందంతో నిండాలి. ఈ పండుగ సీజన్ మీ జీవితంలో నవ్వులను, ప్రశాంతతను నింపాలని కోరుకుంటూ నియోజకవర్గ ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు. ఆ దేవుడి దీవెనలు ఎల్లప్పుడూ నియోజకవర్గ ప్రజలపై ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు.

# నియోజకవర్గం ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

**మాచవరం మేజర్ న్యూస్ :** గురజాల నియోజకవర్గ ప్రజలందరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు కరుణామయుడు, శాంతి దూత ఏసుప్రభు ఆశీస్సులతోని గురజాల నియోజకవర్గ ప్రజలందరూ కూడా సుఖ సంతోషాలతో ఉండాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ నియోజకవర్గ ప్రజలందరికీ కూడా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసారు.

– శాసనసభ్యులు యరపతినేని

# చిలువూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమం



**దుగ్గిరాల మేజర్ న్యూస్ :** దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు సేవ కేంద్రం నందు 20 మంది రైతులు వద్ద నుంచి వ్యవసాయ శాఖ అధికారులు వరి నమూనాలను సేకరించారు. సేకరించిన వరి నమూనాలను హైదరాబాద్ వ్యవసాయ ల్యాబ్ కు పంపనున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్. విజయబాబు, పొలంబడి ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, ఏఈఓ ఆదిలక్ష్మి, ఎఫ్.టి.ఓ రామకృష్ణ, వి ఏ ఏ చంద్రశేఖర్, సాయి కృష్ణ, విహెచ్ఏ ప్రశాంత్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీస్తు ప్రేమ మార్గం అనుసరణీయం



**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** ఏసుక్రీస్తు చూపిన దయ, ప్రేమ మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీ యమని జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యదర్శి అర్తిమళ్ల రమేష్ అన్నారు. దైవ కృప పెదకూరపాడు మండల పాస్టర్ ఫెలోషిప్ అధ్వర్యంలో బుధవారం పెదకూరపాడు సామాజిక ఆరోగ్యకేంద్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేకు కోసి కొవొత్తులు వెలిగించి శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పండుగ శాంతి, ప్రేమ, సోదర భావం, త్యాగం వంటి విలువలను సమాజానికి గుర్తు చేస్తుందన్నారు. వైద్య సిబ్బంది, రోగులు, ప్రజల మధ్య ఆసుపత్రిలో వేడుకలు నిర్వహించటం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఫాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు ప్రకాష్, ఫాస్టర్లు నిర్మలరావు, ట్రెజరర్ క్రీస్తుదాసు, బాబురావు, ఎలీషా, తిమోతి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు

– ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



**వినుకొండ మేజర్ న్యూస్ :** క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రైస్తవ సోదరులకు ప్రభుత్వ చీఫ్ వెప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభువు యేసుక్రీస్తు ఆచరించిన ప్రేమ, కరుణ,సహనం ప్రతి ఒక్కరిలో పెంపొందాలని ఆకాంక్షించారు. క్రీస్తు చూపిన మార్గమైన దయ, త్యాగ గుణం ప్రతి ఒక్కరూ అలవర్చుకున్నప్పుడే జీవితం సంతోషమయ మవుతుందని, ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన మార్గంలో నడుస్తూ ప్రజలందరి పట్ల కరుణ ప్రేమతో మెలుగుదామన్నారు. క్రిస్మస్ వేడుకలను ప్రజలంతా కలిసికట్టుగా జరుపుకోవాలని, అందరి జీవితాల్లో సంతోషాలు నింపాలని చీఫ్ విప్ జీవి ఆంజనేయులు కోరారు.

# గురజాల గ్రామంలోని వెంకట్రావు కాలనీలో నివాస స్థలాన్ని కూల్చివేత



గురజాల మేజర్ న్యూస్ : గురజాల గ్రామంలోని వెంకటరావు కాలనీలో గత 25 సంవత్సరాలుగా నివసిస్తున్నటు వంటి వెంకట్రావు అనే వ్యక్తి తన ఇల్లు బాగు చేసుకునే క్రమంలో కొంద రు వ్యక్తులు వచ్చి ఈ స్థలంలో నీవు నివసించుటకు వీలు లేదు అని భయభ్రాంతులను గురి చేసి ఉంటున్నటువంటి నివాసం ఇంటిల నీ కూల్చివేశారు వెంకట్రావు అనే వ్యక్తి పోలీసులను ఆశ్రయించగా వారిపై కేసులు పెట్టడం జరిగింది సిఐ గారు ఎమ్మార్వోలు ఆశ్రయించమన్నారు సదరు బాధితుడు వెంకట్రావు ఎమ్మార్వో ని ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేశాడు ఇందులో కొందరు బాధితులు వెంకట్రావు వంగపాటి కామేశ్వరి మరి కొందరు బాధితులు పాల్గొన్నారు.

# గంజాయి మత్తు పదార్థాల పైన ఉక్కు పాదం



బొల్లపల్లి మేజర్ న్యూస్ : బొల్లాపల్లి మండలం సీతారాంపురం తండాలో కార్డెన్ సెర్చ్‌డిఎస్పీతో సహా 100 మంది సిబ్బంది హాజరుపల్నాడు జిల్లా, ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు బొల్లాపల్లి మండలం సీతారాంపురం తండాలో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు డిఎస్పీ హనుమంతరావు వెల్లడించారు. ఈ తనిఖీల్లో భాగంగా 100 మంది సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా 32 ద్విచక్ర వాహనాలు. ఒక కారు, 4 గొడ్డలు, 3 కత్తులు. కొన్ని కొడవళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ గ్రామంలో గంజాయి వాడకం.విక్రయం వంటి సమాచారం ఉందని, అందులో భాగంగా తనిఖీలు చేసినట్లు వెల్లడించారు. గ్రామస్తులు గంజాయి పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రత్యక్షంగా, పరోక్షం గా ఎవరు భాగస్వాములైనా వారిని చట్టపరంగా శిక్షించటం జరుగుతుందని తెలిపారు. తండావాసులు గంజాయి పట్ల అప్రమత్తంగా ఉండాలని. ఐజి స్థాయి అధికారి పర్యవేక్షణలో గంజాయిపై ప్రత్యేక నిఘా నడుస్తుందని తెలిపారు.చాక్లెట్లు, సిగరెట్లు వగైరాల ద్వారా గంజాయి సరఫరా జరుగుతుందని తెలిపారు. సమీప అడవిలో గంజాయి మొక్కలు కనిపించినా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని ఈగల్ టీం ఆధ్వర్యంలో గంజాయి పై ఆపరేషన్ కొనసాగుతుందని ఆయన వెల్లడించారు. 13 డ్రోన్ల ద్వారా గంజాయి పట్టివేత ఆపరేషన్ కొనసాగుతుందని డి ఎస్పీ స్పష్టం చేశారు.

# ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

– ఇంచార్జ్ ఏడిఏ విజయబాబు



తెనాలి మేజర్ న్యూస్ : ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఆర్ విజయబాబు హెచ్చరించారు. స్థానిక చెంచుపేటలోని మండల వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో బుధవారం తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల మండల ఎరువుల డీలర్లు సొసైటీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ ప్రతి ఎరువుల షాపు, సొసైటీల ద్వారా యూరియా, డిఏపి మరియు కాంప్లెక్స్ ఎరువులు నిర్ణయించిన ధరలకే విక్రయించాలని, యూరియాని అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ధరల పట్టిక కూడా షాపు నందు ప్రదర్శించాలని, రికార్డులు, రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్ డేట్ చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మూడు మండలాల డీలర్లు, తెనాలి సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్ విజయబాబు, తెనాలి మండల వ్యవసాయాధికారి. కె సుధీర్ బాబు, కొల్లిపర మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రేపు జరిగే రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయండి

గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని, నూతన 2025 ఉపాధి చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీలు, దళిత, ప్రజాసంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐయం జిల్లా కార్యదర్శి వై.నేతాజి ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005లో వామపక్షాల వత్తిడితో తీసుకవచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఈ 20 సంవత్సరాల కాలంలో వ్యవసాయ కార్మికులకు, పేద, చిన్న సన్నకారు రైతులకు ఎంతో మేలు చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతంలో వలసల నివారణకు ఎంతో ఉపయోగపడిందన్నారు. నేడు కేంద్రంలోని బి.జె.పి ప్రభుత్వం చట్టంలో మార్పులు చేసి నూతన చట్టం తీసుకవచ్చిందన్నారు. దీని వల్ల పేదరికం తగ్గకపోగా వలసలు పెరిగే అవకాశం ఎక్కవగా వుందన్నారు. అదే విధంగా రాష్ట్రాలపై భారం పెంచడం వల్ల చట్టం నిర్వీర్యం అవుతుందన్నారు. ఈ నేపథ్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని కోరుతూ జరిగే ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీలు, దళిత, ప్రజాసంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# అల్గారిథమ్స్‌తో ఇంజినీరింగ్ విద్యలో విప్లవాత్మక మార్పులు


- విశాఖపట్నం ఐఐపీఈ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టీ. హేమంత్ కుమార్
- విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఘనంగా ముగిసిన అంతర్జాతీయ వర్క్‌షాప్




గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ : ఆధునిక మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్స్ ద్వారా ఇంజినీరింగ్ విద్యలో గణనీయమైన మార్పులు చోటు చేసుకోనున్నాయని విశాఖపట్నంలోని ఐఐపీఈ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ) అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టీ. హేమంత్ కుమార్ అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యుమానిటీస్ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ ఆధ్వర్యంలో "డేటా డ్రివెన్ అప్రోచెస్ టు ఎంపవరింగ్ ఇంజినీర్స్ ఫర్ ఎ సస్టైయినబుల్ ఫ్యూచర్" అనే అంశంపై మూడు రోజుల పాటు హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన అంతర్జాతీయ వర్క్‌షాప్ బుధవారం ఘనంగా ముగిసింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ టీ. హేమంత్ కుమార్ మాట్లాడుతూ యువ ఇంజినీర్లు కేవలం అల్గారిథమ్స్ నేర్చుకోవడానికే పరిమితం కాకుండా, వాటిని వాస్తవ ప్రపంచ సమస్యలకు అన్వయించగల సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. డేటా ఆధారిత సాంకేతికతలు భవిష్యత్‌లో సస్టైయినబుల్ ఇంజినీరింగ్ పరిష్కారాలకు మార్గనిర్దేశం చేస్తాయన్నారు. మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్స్ భారీ డేటాను వేగంగా విశ్లేషించి ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఉపయోగపడ తాయని తెలిపారు. ఐఐటీ తిరుపతి ప్రొఫెసర్ కే.టి. అరుణ్ మాట్లాడుతూ డేటా సైన్స్ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా భారీ డేటాను విశ్లేషించి విధాన నిర్ణయాలు, వ్యాపార వ్యూహాలు, అకడమిక్ పరిశోధనలకు అవసరమైన స్పష్టమైన అవగాహన లభిస్తుందని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఐటీ సంస్థ సైనెక్రాన్‌లో డేటా సైంటిస్ట్ ఈ. వంశీకృష్ణ మాట్లాడుతూ డేటా అనలిటిక్స్, డేటా సైన్స్‌కు సంబంధించిన సిద్ధాంతాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఎలా ప్రాయోగికంగా అమలు చేయవచ్చో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# అరండల్ పేటలో ఘనంగా క్యాప్రి గోల్డ్ లోన్ శాఖ ప్రారంభం

- అతి తక్కువ వడ్డీ, తరుగుతో లోన్ సౌకర్యం మా ప్రత్యేకత
- క్యాప్రి గోల్డ్ లోన్ బిజినెస్ హెడ్ రాఘవేంద్ర హెచ్ ఎన్



గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ : ఎన్ బి ఎఫ్ సి శాఖలలో కీలకంగా వ్యవహరిస్తూ అంచలంచెలుగా ఖాతాదారుల సహకారంతో ఎదుగుతున్న క్యాప్రి గోల్డ్ లోన్ బ్రాంచ్ శాఖను గుంటూరులోని అరండల్ పేటలో ఏర్పాటు చేయడం తమకెంతో ఆనందంగా ఉందని క్యాప్రి గోల్డ్ లోన్ బిజినెస్ హెడ్ రాఘవేంద్ర హెచ్ ఎన్ పేర్కొన్నారు. ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాలలో విస్తరించిన తమ బ్రాంచ్ గుంటూరులోని అరండల్ పేటలో తమ తొలి బ్రాంచ్ కి ప్రారంభిస్తున్నామని తెలియజేస్తు స్పందుకు సంతోషంగా ఉందన్నారు. తమకు వెన్ను దన్నుగా నిలిచి శాఖ ప్రారంభోత్సవానికి విచ్చేసిన గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ బుధవారం క్యాప్రి గోల్డ్ లోన్ శాఖను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ బ్రాంచ్ లో డిజిటల్ సౌకర్యం కల్పించి కస్టమర్లకు 10 నిమిషాలలోపే రుణ సౌకర్యం కల్పించి పంపిస్తామని, ఈ విధానం తమ వద్ద మాత్రమే ఉందని స్పష్టం చేశారు. తమ శాఖలో 99 పైసల వడ్డీకే రుణాన్ని అందించే ఆకర్షణీయమైన వడ్డీ రేటును ప్రకటిస్తున్నామన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ మాట్లాడుతూ క్యాప్రి గోల్డ్ లోన్ వద్ద రుణం పొందిన వారి బంగారానికి సదరు శాఖ వారే ఉచితంగా భీమా చేయడం ఎన్ బి ఎఫ్ సి ( నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ) లలో కొత్త అధ్యాయానికి తెరలేపినట్లుగా ఉందన్నారు. అతి తక్కువ దస్తావేజులతో, ఎప్పుడైనా, ఎంతైనా వడ్డీని చెల్లించే విధంగా క్యాప్రి గోల్డ్ లోన్ శాఖ వారి విధివిధానాలను రూపొందించబడిందని విన్నానని చెప్పారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారిని ఇబ్బంది పెట్టకుండా వారికి అవసరమైన రుణ సదుపాయాలను అతి తక్కువ వడ్డీకే ఏర్పాటు చేస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని క్యాప్రి గోల్డ్ లోన్ శాఖ సిబ్బందికి చెప్పారు. ఈ కార్యక్రమంలో క్యాప్రి గోల్డ్ లోన్ రీజనల్ మేనేజర్ డి. నవీన్ కుమార్, ఏరియా మేనేజర్ కె. రామకోటేశ్వరరావు, అరండల్ పేట శాఖ మేనేజర్ ఈ రామకోటేశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్ జోసెఫ్, గోల్డ్ వాల్యూవర్ లక్ష్మయ్య, సీనియర్ రిలేషన్ షిప్ మేనేజర్ డి.నాగలక్ష్మి, ఖాతాదారులు పాల్గొన్నారు.

# కరుణ చూపడమే క్రీస్తు సందేశంగుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్



గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ : సర్వ మానవ సమానత్వం, సౌభ్రాతృత్వం, సహనం, శాంతి, ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ వంటి క్రీస్తు బోధనలు సకల మానవాళికి అనుసరణీయమని గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్ వ్యాఖ్యానించారు. క్రిస్మస్ పర్వదిన సందర్భంగా క్రైస్తవులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి క్యాంపు కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ సెల్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు వాసిమళ్ళ విజయ్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బందా రవీంద్రనాథ్ మాట్లాడుతూ, శాంతి, సంతోషం, త్యాగం, ప్రేమ, కరుణకు తార్కాణంగా సాగిన క్రీస్తు జీవన గమనం నేటికీ అందరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, ఆకాశమంతటి సహనం, అవధుల్లేని త్యాగం, శాంతియుత జీవనం వంటివి మానవాళికి క్రీస్తు ఇచ్చిన మహోన్నత సందేశాలని తెలిపారు. క్రీస్తు బోధనలు ఎప్పటికీ మనుషులందరినీ మంచి మార్గంలో నడిపిస్తాయన్నారు. క్రీస్తు సందేశాన్ని అర్థం చేసుకుని అంతా ఐకమత్యంతో మెలుగుతూ.. ఎదుటివారిని క్షమించే గుణాన్ని అలవరచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల దేవానంద్, ముత్యం, పానుగంటి చైతన్య, జ్యోతి బాబు, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), బూసి రాజలత, కొరిటిపాటి ప్రేమ్ కుమార్, వెలుగూరి రత్న, గనిక జాన్సీ, భాగ్యరావు, ఆలా కిరణ్, గంగాధర్ రెడ్డి, పాస్టర్స్ బాలశౌరి, గిడియోన్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రీమ్ ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ఏర్పాటు



పిడుగురాళ్ల మేజర్ న్యూస్ : పట్టణంలోనే ఆర్టీసీ బస్సు డిపో వద్ద టి.ఎన్.టి.యు.సి పట్టణ అధ్యక్షులు యరగాని లడ్డు (వెంకట్) ఆధ్వర్యంలో టి.ఎన్.టి.యు.సి అనుబంధ సంస్థగా పై డ్రీమ్ ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని టి.ఎన్.టి. యు.సి జెండా ఆవిష్కరణ, అసోసియేషన్ బోర్డు ఓపెనింగ్ కార్యక్రమం పిడుగురాళ్ల తెలుగుదేశం పార్టీ, జనసేన ముఖ్య నాయకుల చేతుల మీదుగా జరిగింది. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పిల్లి చెన్నారావు, సయ్యద్ అమీర్‌అలి జండా ఆవిష్కరణ చేశారు. అసోసియేషన్ బోర్డును వడ్డవల్లి సర్వేశ్వరరావు, కామిశెట్టి రమేష్ బాబు ఓపెన్ చేయగా వడ్డవల్లి సాంబశివరావు, దూదేకుల ఖాసీం సైదా, బీజేపీ కాశీ లు సహకరించగాఈ కార్యక్రమంలో వల్లెపు రామకృష్ణ,వై.కొండలు, షేక్ కారు సైదా, నకరికంటి శివ, నల్లబోతుల గాలయ్య, జనత సైదా, అజయ్, షేక్ షబ్బీర్, నాగరాజు గౌడ్, ఆర్.టి.ఏ.సైదా, నడికుడి వెంకటేశ్వరరావు, డి లాల్ బాబు, జనసేన సలీం, ఆటోసైదా, తెలుగుదేశం, కూటమి నాయకులు, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ సి.హెచ్.యమ్.దాసు, సెక్రటరీ పి.దాసు, వైస్ ప్రెసిడెంట్ డి. దాసు, జాయింట్ సెక్రటరీ వై సురేష్ కుమార్, ట్రెజరర్ సి.హెచ్. స్టేఫిన్, సలహా దారులు యస్.రాము, కమిటీ మెంబెర్స్ తదితరులు పాల్గొన్నారు.


# తక్షణ స్పందనకు పురమిత్ర యాప్ ని వినియోగించుకోవచ్చు : జిఎంసి కమిషనర్



**గుంటూరు, జిల్లా పరిషత్ మేజర్ న్యూస్ :** గుంటూరు నగర ప్రజలు తమ స్థానిక సమస్యలపై తక్షణ స్పందనకు పురమిత్ర యాప్ ని వినియోగించుకోవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆర్టీసి కాలనీ, ఐపిడి కాలనీ, ఎల్ఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి పిజిఆర్ఎస్, డివైసిలో అందిన ఫిర్యాదులను, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేసి, ప్రజలతో పురమిత్ర యాప్ ని డౌన్లోడ్ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పురమిత్ర యాప్ ద్వారా 122 రకాల పురపాలక సేవలు, గ్రీవెన్స్ లు, చెల్లింపులను చేతిలోని ఫోన్ ద్వారానే పొందవచ్చన్నారు. కార్యాలయాల చుట్టూ తిరగకుండా సేవలను పొందేలా, అధికారులు జవాబుదారీతనంతో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ యాప్ ని రూపొందించిందన్నారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు వాటి పరిష్కార స్తితిని తెలుసుకోవానికి ట్రాకింగ్ ఉండడం వలన ప్రజలకు తమ సమస్య, లేదా తమ దరఖాస్తు స్థితి తెలుసుకోవచ్చన్నారు. ప్రతి దరఖాస్తు పరిష్కారానికి నిర్దేశిత గడువు ఉన్నందున సిబ్బంది కూడా భాద్యతగా వ్యావహరిస్తారని పేర్కొన్నారు. ఐపిడి కాలనీ ఉత్తరవారి వీధిలో పందుల సమస్యపై అందిన ఫిర్యాదుని పరిశీలించి, పందులను పెంచే వారికి నోటీసులు ఇచ్చి, వాటికి స్పందించకుంటే జిఎంసి నుండి తగు చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులను, ఎల్ఆర్ కాలనీలో ఫిర్యాదుని పరిశీలించి, ప్రజల రాకపోకలకు వీలుగ రోడ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే సదరు ప్రాంతంలో కమర్షియల్ సంస్థల ఆస్తిపన్నుని పరిశీలించి, లేకుంటే అపరాధ రుసుం విధించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆర్టీసి కాలనీలో ఆక్యుపెన్సీ కోసం అందిన దరఖాస్తు చేసుకున్న బహుళ అంతస్తు భవనాన్ని నిర్దేశిత ప్లాన్ మేరకు కొలతలు పరిశీలించారు. ఈ పర్యటన డిఈఈ శ్రీనివాస్, కార్పొరేటర్ రంగారెడ్డి, ఎస్ఎస్ లు సాంబయ్య, అయూబ్ ఖాన్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# అరండల్ పేటలో ఘనంగా క్యాప్రి

- గోల్డ్ లోన్ శాఖ ప్రారంభం అతి తక్కువ వడ్డీ
- తరుగుతో లోన్ సౌకర్యం మా ప్రత్యేకత
- క్యాప్రి గోల్డ్ లోన్ బిజినెస్ హెడ్ రాఘవేంద్ర హెచ్ ఎన్



**గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్ :** ఎన్ బి ఎఫ్ సి శాఖలలో కీలకంగా వ్యవహరిస్తూ అంచలంచెలుగా ఖాతాదారుల సహకారంతో ఎదుగుతున్న క్యాప్రి గోల్డ్ లోన్ బ్రాంచ్ శాఖను గుంటూరులోని అరండల్ పేటలో ఏర్పాటు చేయడం తమకెంతో ఆనందంగా ఉందని క్యాప్రి గోల్డ్ లోన్ బిజినెస్ హెడ్ రాఘవేంద్ర హెచ్ ఎన్ పేర్కొన్నారు. ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాలలో విస్తరించిన తమ బ్రాంచ్ గుంటూరులోని అరండల్ పేటలో తమ తొలి బ్రాంచ్ కి ప్రారంభిస్తున్నామని తెలియజేస్తు న్నందుకు సంతోషంగా ఉందన్నారు. తమకు వెన్ను దన్నుగా నిలిచి శాఖ ప్రారంభోత్సవానికి విచ్చేసిన గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నసిర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ బుధవారం క్యాప్రి గోల్డ్ లోన్ శాఖను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ బ్రాంచ్ లో డిజిటల్ సౌకర్యం కల్పించి కస్టమర్లకు 10 నిమిషాలలోపే రుణ సౌకర్యం కల్పించి పంపిస్తామని, ఈ విధానం తమ వద్ద మాత్రమే ఉందని స్పష్టం చేశారు. తమ శాఖలో 99 పైసల వడ్డీకే రుణాన్ని అందించే ఆకర్షణీయమైన వడ్డీ రేటును ప్రకటిస్తున్నామన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ మాట్లాడుతూ క్యాప్రి గోల్డ్ లోన్ వద్ద రుణం పొందిన వారి బంగారానికి సదరు శాఖ వారే ఉచితంగా భీమా చేయడం ఎన్ బి ఎఫ్ సి ( నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ) లలో కొత్త అధ్యాయానికి తెరలేపినట్లుగా ఉందన్నారు. అతి తక్కువ దస్తావేజులతో, ఎప్పుడైనా, ఎంతైనా వడ్డీని చెల్లించే విధంగా క్యాప్రి గోల్డ్ లోన్ శాఖ వారి విధివిధానాలను రూపొందించబడిందని విన్నానని చెప్పారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారిని ఇబ్బంది పెట్టకుండా వారికి అవసరమైన రుణ సదుపాయాలను అతి తక్కువ వడ్డీకే ఏర్పాటు చేస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని క్యాప్రి గోల్డ్ లోన్ శాఖ సిబ్బందికి చెప్పారు. ఈ కార్యక్రమంలో క్యాప్రి గోల్డ్ లోన్ రీజనల్ మేనేజర్ డి, నవీన్ కుమార్, ఏరియా మేనేజర్ కె. రామకోటేశ్వరరావు, అరండల్ పేట శాఖ మేనేజర్ ఈ రామకోటేశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్ జోసెఫ్, గోల్డ్ వాల్యూవర్ లక్ష్మయ్య, సీనియర్ రిలేషన్ షిప్ మేనేజర్ డి.నాగలక్ష్మి, ఖాతాదారులు పాల్గొన్నారు.

# క్యాంపస్ ఇంటర్వ్యూ లలో 17 మంది విద్యార్థులు ఎంపిక




**యడ్లపాడు,మేజర్ న్యూస్:** మండలపరిధిలోని బోయపాలెం శివారు తుమ్మలపాలెం గ్రామంలోని శ్రీ మిట్టపల్లి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల నందు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యస్.గోపాలకృష్ణ , కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేసెమెంట్ విభాగం వారి సంయుక్త ఆధ్వర్యం లో బి.టెక్. నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు టెక్నో పరిన్ సాఫ్ట్, వి స్టాండ్ 4ఖ సొల్యూషన్స్, పెంటగాన్ స్పేస్ కంపెనీ లు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఈ ఇంటర్వ్యూలలో కళాశాలకు చెందిన 17 మంది విద్యార్థిని, విద్యార్థులు ఎంపికైనారు. వీరికి వార్షికవేతనం సుమారు 3 నుండి 12 లక్షల వరకు ఉంటుందని కంపెనీ హెచ్ ఆర్ ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ శ్రీ ఎం బి వి సత్యనారాయణ ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులను అభినందించి ఈ పోటీ ప్రపంచం లో రాణించాలంటే ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకొని అన్ని రంగాలలో అత్యుత్తమ ప్రతిభ కనపరచాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ, ఏఓ సిహెచ్ శ్రీనివాసరావు, టి పి ఓ కె.విజయ్ కుమార్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి హోమ సహిత శాంతి కళ్యాణం



**దుగ్గిరాల ,మేజర్ న్యూస్ :**దుగ్గిరాల గ్రామంలోని రైలుపేట మార్కెట్ యార్డు వద్ద గల శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు ఘనంగా హోమ సహిత శాంతి కళ్యాణం ను నిర్వహించారు .ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఉదయాష్టమ సేవ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన కాట్రగడ్డ వంశీకృష్ణ లక్ష్మి శృతి దంపతులు పాల్గొని కళ్యాణం నిర్వహించగా అర్చకులు శ్రీ భాష్యం సాకేత్ వేదాంతం రామచంద్ర దివి నాగ శ్రీనివాసులు వేదమంత్రాలు నడుమ ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు .ఉదయం సుప్రభాత సేవ అర్చన 108 కలశాలతో అష్టోత్తర అభిషేకం పాదపద్మ రాధన తిరుప్పావడ కళ్యాణం పుష్ప యాగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని.తీర్థ ప్రసాదాలు స్వీకరించి అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు : నగర మేయర్



**గుంటూరు, జిల్లా పరిషత్ మేజర్ న్యూస్ :** నగర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలియజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, క్రైస్తవ సోదరులంత క్రిస్టమస్ పండుగ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. ఈ క్రిస్టమస్ మీ జీవితంలో సంతోషాన్ని నింపాలని, మీ ఇంట ఆనందపు కాంతులు వెదజల్లాలని కోరుకుంటూ నగర ప్రజలందరికి క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియచేశారు.

# దుగ్గిరాల పోలీస్ స్టేషన్లో ఘనంగా సెమీ క్రిస్టమస్ వేడుకలు




**దుగ్గిరాల ,మేజర్ న్యూస్** :దుగ్గిరాల పోలీస్ స్టేషన్ నందు సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్టేషన్ ఎస్ఐ ఎస్ వెంకట రవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంగళగిరి. సి ఐ బ్రహ్మం హాజరై కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు . ఎస్సై వెంకట రవి హాజరైన అతిధులను శాలువాలతో సన్మానించి ఆత్మీయ విందును ఏర్పాటు చేశారు .ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ప్రభుదాస్ ,హెడ్ కానిస్టేబుల్స్ కోటేశ్వరరావు ,చెన్నయ్య, రైటర్ శ్రీనివాస్ ,కానిస్టేబుల్స్ ప్రసాద్ ,కుమార్, విజయ్,, గోపి ,సతీష్ ,సాంబశివరావు ,శ్రీహరి, లోకేశ్వరరావు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# బైకును ఢీకొన్న ఆటో వ్యక్తికి గాయాలు



**తాడికొండ మేజర్ న్యూస్.** తాడికొండ మండలంలోని లామ్ గ్రామం వద్ద మంగళవారం అర్ధరాత్రి బైకును ఆటో ఢీకొనడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బడే పురం గ్రామానికి చెందిన ఉప్పలపాటి సుదర్శన్ రావు 43 సంవత్సరాలు గల వ్యక్తి గుంటూరు నుంచి రాత్రి సుమారు 11 గంటల సమయంలో తన గ్రామం వెళ్తుండగా లామ్ దగ్గర ఆటో ఢీకొనడంతో గాయాలవడంతో వైద్యం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సుదర్శన్ రావు ఫిర్యాదు మేరకు తాడికొండ ఎస్సై జత్యా నాయక్ కేసు నమోదు చేసుకొని ఆటోను స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# బోధి పాఠశాలలో ఘనంగా ప్రీక్రిస్మస్ వేడుకలు



**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు గ్రామంలోని బోధి పాఠశాలలో బుధవారం ప్రీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫాదర్ శేఖర్, జగదీష్ హాజరయ్యారు. అతిథులు పాఠశాల విద్యార్థులను ఆశీర్వదించి, జీవితంలో లక్ష్యాలను సాధించేందుకు ప్రేరణనిచ్చేలా ఉత్సాహభరితమైన ప్రోత్సాహకరమైన ప్రసంగాలు చేశారు. వారి మాటలు విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాట్లాడుతూ.. విద్యతో పాటు విలువలు, సంస్కృతి, నైతికత కూడా ఎంతో ముఖ్యమని తెలియజేశారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పాటలు, నృత్యాలు, క్రిస్మస్ సందేశాలతో కార్యక్రమం సందడిగా కొనసాగింది. అనంతరం విద్యార్థులకు ప్లమ్ కేక్‌లను పంపిణీ చేసి క్రిస్మస్ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిశాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలుకాసు మహేష్ రెడ్డి మాజీ శాసనసభ్యులు




**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసిన కాసు మహేష్ రెడ్డి మాజీ శాసనసభ్యులు, క్రిస్మస్ అనేది యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకునే అతి పెద్ద పండుగఅన్నారు. ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 25న ఘనంగా జరుపుకుంటారు. ప్రభువైన యేసుక్రీస్తు జననం ప్రేమ, శాంతి, త్యాగం, సేవ భావాలకు ప్రతీక. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరుపుతారు. కొత్త ఆశలు, నూతన ఉత్సాహం తీసుకురావాలని కోరుకుంటూ మీకు మీ కుటుంబ సభ్యులకు క్రిస్మస్ శుభాకాంక్షలు అన్నారు.

## పార్లమెంటరీ తెదేపా ఉపాధ్యక్షులుగా "దరువూరి"



**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** డిఎన్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ కాంట్రాక్టర్, నియోజకవర్గ నాయకులు దరువూరి నాగేశ్వరరావు నరసరావుపేట పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులుగా ఎంపికయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుంచి నియామక పత్రం అందింది. ముప్పాళ్ళ మండలం ఇరుకుపాలెం గ్రామానికి చెందిన నాగేశ్వరరావు క్లాస్ వన్ కాంట్రాక్టర్ గా అనేక నిర్మాణాలు చేపట్టారు. సత్తెనపల్లిలో స్థిరపడి తెలుగుదేశం పార్టీలో చేరి కన్నా లక్ష్మీనారాయణ గెలుపులో విశేషంగా కృషి చేశారు. ఈ నియామకానికి సహకరించిన శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణకు, ఇతర నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. డిఎన్ఆర్ కు స్థానిక నాయకులు కూటమి అనుబంధ సంఘాల బాధ్యులు తదితరులు అభినందనలు తెలిపారు.

## నేరస్తులపై కఠిన చర్యలు తప్పవు అడిగొప్పలలో ఎంపీ, ఎమ్మెల్యే వ్యాఖ్యలు





**దుర్గ మేజర్ న్యూస్:** దుర్గి మండల పరిధిలోని అడిగొప్పల గ్రామంలో ఇటీవల ప్రత్యర్థుల చేతిలో హతులైన టీడీపీ కార్యకర్తలు, అన్నదమ్ములైన కొత్త శ్రీరామమూర్తి, హనుమంతు కుటుంబ సభ్యులను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన వారు, కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటువంటి దారుణ ఘటనలు అత్యంత బాధాకరమని పేర్కొంటూ, పార్టీ పరంగా మరియు వ్యక్తిగతంగా బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నేరస్తులపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వ స్థాయిలో చర్యలు చేపడతామని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు తాము కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నిర్మల ఫార్మసీ కళాశాల లో సెమి క్రిస్మస్ వేడుకలు



**మంగళగిరి, మేజర్ న్యూస్:** మంగళగిరి మండలం ఆత్మకూరులోని నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ లో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ ఫైటోకెమిస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో బుధవారం సెమి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంబూరు, గుంటూరులోని ఆనంద జ్యోతి ఇన్స్టిట్యూట్ సుపీరియర్ రెవ్. ఫాదర్ అశోక్ ఎస్.జే. హాజరై ప్రసంగించారు. క్రిస్మస్ ప్రేమ, శాంతి, ఆనందం, క్షమాశీలతకు ప్రతీకగా నిలిచే పండుగ అన్నారు. ప్రతి ఒక్కరూ పరస్పర క్షమాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల చీఫ్ పేట్రన్ రెవ్. సిస్టర్ డా. యు. శౌరీలు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. అనంతరం కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ రెవ్. సిస్టర్ జి. నిర్మల జ్యోతి ప్రసంగిస్తూ క్రిస్మస్ పండుగ ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు, మానవీయ భావాలు పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రిన్సిపాల్ డా. బి. పాముల రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో జీవిస్తూ దయాగుణం కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలు నిర్వహించిన క్రిబ్ పోటీలు, నైతిక స్కిట్‌లు, క్రీడలు, ఎన్‌పీడబ్ల్యూ కార్యక్రమాలు, గానం, నృత్యం తదితర సాంస్కృతిక పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. అలాగే ముఖ్య అతిథి రెవ్. ఫాదర్ అశోక్ ఎస్.జే. ను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జారిపడుతోన్న బండరాళ్లు -ప్రమాద భరితంగా పానకాల స్వామి ఘాట్ రోడ్డు మార్గం

- పట్టీపట్టనట్లుగా దేవాదాయశాఖ అధికారులు
- రిటైనింగ్ వాల్ నిర్మించాలని భక్తుల వినతి





**మంగళగిరి, మేజర్ న్యూస్:** మంగళగిరి కొండపై వేంచేసియున్న శ్రీ పానకాల లక్ష్మీ నృసింహ స్వామి ఆలయానికి వెళ్లే ఘాట్ రోడ్డు మార్గంలో తరచూ బండరాళ్లు జారిపడుతోన్నాయి. దీంతో ఘాట్ రోడ్డు మార్గంలో రాకపోకలు సాగించే భక్తులు, వాహనదారులు బండరాళ్లు ఎక్కడ తమపై పడిపోతాయోనని భయాందోళనకు గురి అవుతున్నారు. ఘాట్ రోడ్డు నిర్వహణా లోపంతో ప్రమాద భరితంగా తయారవడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘాట్ రోడ్డు వెంబడి కొండకు రిటైనింగ్ వాల్ నిర్మిస్తే తమ ప్రాణాలను కాపాడిన వారవుతారని భక్తులు అంటున్నారు.

**ఎగువ సన్నిధిలో కార్లు పార్కింగ్ వద్ద అపరిశుభ్రత**
**నిలిచిన మురుగునీటి తో దుర్వాసన**

కొండపై కార్లు పార్కింగ్ చేసే ప్రాంతంలో మురుగునీరు నిలిచి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. నిలిచిన మురుగునీరు పచ్చగా మారడంతో పాటు దోమలు పెరిగి వ్యాప్తి చెందుతోన్నాయి. దీంతో ఎగువ సన్నిధికి వచ్చే భక్తులు కొంత అసహనానికి గురి అవుతోన్నారు. ఎంతో పవిత్రమైన ఆలయం శ్రీ పానకాల లక్ష్మీ నృసింహ స్వామి ఆవరణలో ఇలాంటి అపరిశుభ్రమైన దృశ్యాలు కనిపించడం బాధాకరమని, అధికారులు స్పందించి శుభ్రతా చర్యలు చేపట్టాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

**కంపు కొడుతోన్న మరుగుదొడ్లు...ఆపై అక్రమంగా రుసుం వసూళ్లు**

మంగళగిరి కొండపై కొలువైన శ్రీ పానకాల లక్ష్మీ నృసింహ స్వామి ఆలయానికి సంబంధించిన మరుగుదొడ్లు అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు మరుగుదొడ్లు వినియోగించుకోవాలంటే రుసుం చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. మల,మూత్ర విసర్జన చేసే భక్తుల వద్ద నుంచి రూ.5 నుంచి రూ. 10 వరకూ అక్రమంగా వసూలు చేస్తోన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే వెటకారపు మాటలతో చీదరించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఎగువ సన్నిధిలో భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## క్రీస్తు జన్మదినం - క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబు





**మంగళగిరి మేజర్ న్యూస్:** శాంతి, ప్రేమ, కరుణతో మానవానికి శుభ సందేశం అందించిన కరుణామయుడు జన్మదిన వేడుకలకు మంగళగిరి నియోజకవర్గం ముస్తాబైంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లోని చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించగా క్రిస్మస్ శోభవెల్లివిరుస్తోంది. బుధవారం అర్ధరాత్రి నుండి పలు ప్రార్ధనా మందిరాల్లో క్రిస్మస్ ప్రార్ధనలు ప్రారంభమయ్యాయి. మంగళగిరి పట్టణపరిధిలోని పాత లూధరన్ చర్చి, పార్క్ రోడ్డులోని ఆర్సీఎం చర్చి, పాత బస్టాండ్ వద్ద వున్న టౌన్ చర్చి, బాప్టిస్ట్ పేట చర్చితో పాటు తాడేపల్లి, దుగ్గిరాలలో ప్రార్ధనా మందిరాలు విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. ఆయా చర్చిల వద్ద భారీగా ఏర్పాటు చేసిన స్టార్లు, క్రిస్మస్ ట్రీలు ఆకట్టుకుంటున్నాయి. యేసుక్రీస్తు సన్నిధిలో ప్రార్ధనలు నిర్వహించేందుకు క్రైస్తవులు సన్నద్ధమయ్యారు. గురువారం ఉదయం చర్చిలలో క్రైస్తవులు క్రిస్మస్ ఆరాధనను భక్తి శ్రద్ధలతో నిర్వహించి, ప్రత్యేక ప్రార్ధనలతో ఆనందోత్సవాల నడుమ జరుపుకోనున్నారు. పలు చర్చిలలో సాంటాక్లాజ్ వేషధారణలతో పాటు, పశువుల పాకలో యేసు జన్మించిన చిత్రాలను ఏర్పాటు చేశారు.

## మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం

**ఎస్ఐ వి. శ్రీహరిబాబు**



**మంగళగిరి మేజర్ న్యూస్:** మాదక ద్రవ్యాల అలవాటుతో భవిష్యత్తు నాశనం అవుతుందని, మాదక ద్రవ్యాల నివారణకు సమిష్టిగా కృషి చేయాలని మంగళగిరి పట్టణ ఎస్ ఐ వల్లపు శ్రీహరిబాబు సూచించారు. మంగళగిరి పట్టణం అరవింద పాఠశాలలో విద్యార్థులకు సంకల్పం కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఐ శ్రీహరిబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మాదక ద్రవ్యాలను వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. డ్రగ్స్ వినియోగంతో పిల్లల భవిష్యత్తు అంధకారం అవుతుందని, వాటిని దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ విక్రయాలు, కొనుగోలు, లేదా ఎవరైనా సేవిస్తున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఇచ్చిన వారి విషయాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. యువతపై దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని వీటికి దూరంగా ఉండే విధంగా ప్రతి ఒక్కరు చేయిచేయి కలిపి పనిచేయాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు పోలీస్ శాఖ యువతలో చైతన్యం తీసుకువచ్చేందుకే సంకల్పం కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీస్తు పుట్టుక ప్రపంచానికే ఆదర్శం



**తెలుగు జర్నలిస్టు సంక్షేమ సంఘం అధ్యక్షులు వాసి మల్ల రాజేష్**

**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :** క్రీస్తు పుట్టుక ప్రపంచానికే రక్షణకరమని గుంటూరు జిల్లా తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షులు వాసిమల్ల రాజేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ సమాజంలో ప్రేమ, ఐక్యత, పరస్పర గౌరవాన్ని పెంపొందించే మహత్తర పండుగ అని అన్నారు. ప్రపంచానికి ప్రేమ, శాంతి, సేవ వంటి శాశ్వత విలువలను అందించిన యేసు క్రీస్తు సందేశం ఎప్పటికీ మానవాళికి మార్గదర్శకమన్నారు. క్రీస్తు బోధనలు, ఆయన చూపిన జీవన బాటను ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం బలిదానాలకు కూడా వెనుకాడని క్రీస్తు గొప్పతనం నుంచి సమాజమంతా స్ఫూర్తి పొందాలన్నారు. శాంతి మార్గాన్ని అనుసరిస్తూ ప్రేమ తత్వాన్ని పెంపొందించుకోవాలని, ఈర్ష్యా-ద్వేషాలకు దూరంగా ఉండాలని సూచించారు. పావులను సైతం క్షమించాలని బైబిల్ బోధిస్తుందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేసి నగర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

# మంగళగిరి ప్రీమియర్ లీగ్ - 4 లో నాలుగవ రోజు పరుగుల వరద

## బౌండరీల వర్షం కురిపించిన చీతాస్ లెవెన్, చెలరేగి ఆడిన భీమ్స్ ఆర్మీ, బ్లాక్ కాప్స్ టీమ్ లు





**మంగళగిరి మేజర్ న్యూస్ :** మంగళగిరి ప్రీమియర్ లీగ్ సీజన్4, మంగళగిరి బోగి ఎస్టేట్ లోని నారా లోకేష్ క్రీడా ప్రాంగణంలో పరుగుల వరద పారించిన క్రికెట్ జట్టులు, మంత్రి మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళగిరి ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న విషయం విధితమే నాలుగవ రోజు బరిలో దిగిన మొదటి మ్యాచ్ బాప్టిస్ట్ పేట క్రికెట్ యూత్, నూతక్కి ఫ్రెండ్స్ యూత్ ల మధ్య జరుగగా విజయం సాధించిన బాప్టిస్ట్ పేట క్రికెట్ యూత్,రెండో మ్యాచ్ భీమ్స్ ఆర్మీ, జీఎస్ఆర్ లెవెన్ టీం ల మధ్య జరుగగా భీమ్స్ ఆర్మీ జట్టు విజయం సాధించింది,మూడవ మ్యాచ్ అండర్ లెవెన్ టీమ్, చీతాస్ లెవెన్ ల మధ్య జరుగగా ఫోర్లు, సిక్సర్ లతో చీతాస్ లెవెన్ జట్టు గెలుపొందింది, నాలుగో మ్యాచ్ నవులూరు నైట్ రైడర్స్ టీం, నారా పవర్ యూత్ ల మధ్య జరుగగా నారా పవర్ యూత్ జట్టు విజయం సాధించింది,ఐదవ మ్యాచ్ కొలనుకొండ కుర్రోళ్ళు బ్లాక్ కాప్స్ జట్టుల మధ్య జరగగా విజయం సాధించిన బ్లాక్ కాప్స్ జట్టు,ప్రతి మ్యాచ్ లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచిన క్రీడాకారుడుకి మాన్ అఫ్ ది మ్యాచ్ ట్రోఫీ, మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్జవ్వాది కిరణ్ చంద్ సహకారంతో 3 వేల రూపాయల నగదు బహుమతి అందజేసిన కూటమి నాయకులు, రేపు క్రిస్మస్ సందర్భంగా రెండు మ్యాచ్ లను మాత్రమే నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్స్ తెలిపారు. ఈవెంట్ స్పాన్సర్లుగా సాయి పావని కన్ స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, బిజ్ 51, సోనోవిజన్, హెూటల్ డి దేవ్, తాడేపల్లి మెడ్ స్టార్ హాస్పటల్స్, సిగ్నేచర్ డైన్, హైపర్ ప్యాక్ ప్రైవేట్ లిమిటెడ్, కోకోకోలా, వీ వైబ్ ఈవెంట్స్ వ్యవహరించనున్నాయి. ప్రతి మ్యాచ్‌ను గోపీ టీవీ యూట్యూబ్ ఛానల్, వి డిజిటల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం అందించడం జరుగుతుంది ప్రీమియర్ లీగ్ సీజన్-4 పోటీలలో ప్రథమ బహుమతి కింద రూ.3 లక్షలు మంగళాద్రి డెవెలపర్స్, ద్వితీయ బహుమతి కింద రూ 2 లక్షలు మంచికలపూడి వైష్ణవి, తృతీయ బహుమతి కింద రూ.లక్ష నగదును వెలగపూడి కిషోర్ సహకారంతో అందించనున్నారు. అలాగే ప్రతి మ్యాచ్‌కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రూ.3 వేలు జవ్వాది కిరణ్ చందు, ప్రతి మ్యాచ్ టాస్ విన్నర్‌కు సిల్వర్ కాయిన్, అలాగే ఫైనల్ మ్యాచ్ టాస్ విన్నర్‌కు గోల్డ్ కాయిన్ రేవతి జ్యూయలరీ, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కింద ఎలక్ట్రానిక్ బైక్ వల్లభనేని భార్గవ్, బ్యాట్స్ మెన్ ఆఫ్ ది సిరీస్ రూ.25 వేలుతో పాటు ఎలక్ట్రికల్ బై సైకిల్ కాసరనేని జస్వంత్, బౌలర్ ఆఫ్ ది సిరీస్ రూ.25 వేలుతో పాటు బై సైకిల్ గుత్తా కిషోర్, ఫీల్డర్ ఆఫ్ ది సిరీస్ రూ.25 వేలతో పాటు బైసైకిల్ తాడిబోయిన మహేష్, వికెట్ కీఫర్ ఆఫ్ ది సిరీస్ రూ. 25 వేలుతో పాటు బై సైకిల్ షేక్ ఇంతియాజ్‌లు అందించనున్నారు. మ్యాచ్‌లో పాల్గొన్న క్రీడాకారులకు టీ షర్ట్స్, ట్రాక్స్ అందజేస్తున్నారు.

# కుటుంబ కలహాల్లో నేపథ్యంలో భావ చేతిలో బావమరిది మృతి



**వినుకొండ మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా వినుకొండ మండలంలోని శృంగారపు వనం కాలనీలో కుటుంబ వివాదం దారుణ హత్యకు దారితీసింది. బావ చేతిలో బావమరిది దారుణంగా హత్యకు గురయ్యాడు.పోలీసుల వివరాల ప్రకారం, క్రోసూరు మండలానికి చెందిన చిలక గోపి అనే వ్యక్తి తన బావమరిది రాచకొండ షారోన్‌తో కుటుంబ విషయాలపై గొడవ పడ్డాడు. ఈ వివాదం కక్షగా మారింది. నిద్రిస్తున్న సమయంలో షారోన్‌పై చిన్న గ్యాస్ సిలిండర్‌తో తలపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. షారోన్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతుండగానే మృతి చెందాడు. ఈ ఘటనపై వినుకొండ సీఐ ప్రభాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు చిలక గోపిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. కుటుంబ కలహాలు ఇలాంటి దారుణ ఫలితాల కు దారితీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

# ఆర్ వి ఆర్ లో ముగిసిన జాతీయ కిసాన్ దివస్ ఎక్స్‌పో





**గుంటూరు రూరల్ మేజర్ న్యూస్ :** మిర్చి రైతాంగానికి ఉపయోగపడే విత్తనాల విత్తే ప్రోటోటైప్ యంత్ర ఆవిష్కర్త తమ కళాశాల పూర్వ విద్యార్థి కావడం అభినందనీయమని కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని పేర్కొన్నారు. ఆర్.వి.ఆర్, జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన “జాతీయ కిసాన్ దివస్ ఎక్స్‌పో - 2025” మరియు “నేషనల్ అగ్రిటెక్ హ్యాకథాన్” కార్యక్రమంలో కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో విద్యను అభ్యసించిన పూర్వపు విద్యార్థి వెంకటేష్ లింగిశెట్టి ఎండుమిర్చి విత్తనాలను విత్తే ప్రోటోటైప్ యంత్ర ప్రదర్శనకు ప్రోత్సాహక నగదు బహుమతిని అందుకున్నారు. ప్రస్తుతం తెలంగాణలోని టి-వర్క్స్‌లో ఫెలోషిప్ ఉద్యోగిగా పనిచేస్తూ, రైతాంగంలో నూతన సాంకేతిక అభివృద్ధి దిశగా వినూత్న ఆలోచనలు చేయడం గొప్ప విషయమని రైతాంగానికి దోహదపడే నూతన ఆవిష్కరణలు జరుపుతూ వికసిత్ ఆంధ్రాలో భాగస్వాములు అవ్వాలని కళాశాల సెక్రటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణ ప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కొల్లా శ్రీనివాస్, అకడమిక్, ఆర్,డి డైరెక్టర్ డా. కె. రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్, అడ్మినిస్ట్రేషన్ డా.ఎన్.వి. శ్రీనివాస రావు, ఎన్. ఐటీ బిఐ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డా. ఎమ్.వి.పి. చంద్రశేఖర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# హబీబుల్లా బేగ్ సేవా స్వచ్ఛంద సంస్థ అవార్డును అందుకున్న ఎంఈఓ సంజీవి



**దుగ్గిరాల మేజర్ న్యూస్ :** పాఠశాలలో పనితీరును మెరుగుపరుస్తూ విద్యార్థులలో దాగివున్న ప్రతిభను గుర్తించి నూటికి నూరు శాతం సాధించే దిశగా కృషి చేస్తున్న ఎంఈఓ సంజీవి నీ హబీబుల్లా. బేగ్ సేవా సంస్థ ఘనంగా సన్మానించి సత్కరించారు. ఎంఈఓ చేస్తున్న కృషిని గుర్తించిన హబీబుల్లా బేగ్ ఫౌండేషన్ సేవా సంస్థ ఉత్తమ సే వా ప్రశం సా పత్రాన్ని అందజేసి శాలువా లతో ఘనంగా సత్కరించారు. అవార్డును అందుకున్న ఎంఈఓ ను ఉపాధ్యాయులు, అభిమానులు ఫౌండేషన్ సేవా సంస్థ సభ్యులు విద్యార్థులు.తదితరులు అభినందించారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి ఈస్ట్ ట్రాఫిక్ సిఐ అశోక్ కుమార్



**గుంటూరు జిల్లా క్రైం మేజర్ న్యూస్ :** వాహన చోదకులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఈస్ట్ ట్రాఫిక్ సిఐ ఆకుల అశోక్ కుమార్ సూచించారు. గుంటూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ గ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డి.ఎస్.పి సూచనల ప్రకారం, బుధవారం నగరంలో ట్రాఫిక్ అవగాహన సదస్సు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈస్ట్ ట్రాఫిక్ సిఐ ఆకుల అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ అవగాహన ర్యాలీ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపం నుంచి ప్రారంభమై, ఎన్.టి.ఆర్ విగ్రహశీ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు మరియు సాధారణ ప్రజలు పాల్గొన్నారు.

# 750 మంది పాస్టర్లకు నూతన వస్త్రాలు పంపిణీ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన పాస్టర్లు



**మంగళగిరి మేజర్ న్యూస్ :** క్రిస్మస్‌ను పండుగను పురస్కరించుకొని పాస్టర్లకు మంత్రి నారా లోకేష్ అన్ని విధాలా అండగా నిలుస్తున్నారు. గత అరేళ్ళు గా పాస్టర్లకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది మంగళగిరి నియోజకవర్గం వ్యాప్తంగా మంత్రి నారా లోకేష్ సొంత ఖర్చుల తో 750 మంది పాస్టర్ల దంపతులకు నూతన వస్త్రాలు పంపించారు. వాటి ని మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో స్థానిక నాయకులు పాస్టర్లకు అందజేశా రు. ఈ సందర్భంగా పాస్టర్లు మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి నారా లోకేష్ మొదటి నుంచి అన్ని మతాలను గౌరవిస్తున్నారు. క్రైస్తవ సోదరులకు అన్ని విధాల అండగా ఉంటామని హామి ఇచ్చారు.

# క్రీస్తు బోధనలు ఆచరించాలి - ఎమ్మెల్యే బూర్ల



**గుంటూరు రూరల్ మేజర్ న్యూస్ :** సమాజంలోని ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు బోధనలు ఆచరించి ప్రశాంత జీవనం సాగించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సూచించారు. గుంటూరు రూరల్ వెంగళయపాలెం లూథరన్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల సమక్షంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ప్రత్యేక ప్రార్థనలు, క్రీస్తు గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కల్లూరి శ్రీనివాసరావు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్.లక్ష్మినారాయణ, రీజనల్ మేనేజర్, ఫోన్ నెం. 63011 07116

## చెన్నాయపాలెం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో అగ్నికి ఆహుతి అయిన ఇల్లు



**మాచవరం, మేజర్ న్యూస్** : మాచవరం మండలం చెన్నాయపాలెం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో చెన్నై పాలెం గ్రామానికి చెందిన బాణావత్ రఘునాయక్ ఇల్లు పూర్తిస్థాయిలో మంటల్లో అగ్నికి ఆహుతి అయింది తమ కుటుంబం పొలం పనులు నిమిత్తం వెళ్ళామని అదే సమయంలో కరెంట్ స్తంభం నుండి ఇంట్లోకి ప్రసారమవుతున్న విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ వచ్చి ఒక్కసారిగా మంటలు చెదరేగాయి వెంటనే తన ఇల్లు పూర్తిగా మంటల్లో కాలిపోయిందని చుట్టుపక్కల వాళ్ళు వచ్చి బిందెలతో నీళ్లు చల్లిన మంటలు ఆరిపోకపోవడంతో ఇంట్లో ఉన్న డబ్బులు బంగారం వెండి సామాన్లు ధాన్యం మంటల్లో కాలిపోయాయని సుమారు తనకు నాలుగు లక్షల మేర నష్టం కలిగిందని రఘునాయక్ కన్నీటిపర్వతం అయ్యాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కట్టుబట్టలతో మిగిలామని తనపై దయ చూపించాలని ఈ సందర్భంగా అధికారులను ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు.

## క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ఎస్ ఐ మణి కృష్ణ



**రాజుపాలెం మేజర్ న్యూస్:** క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రైస్తవ సోదరీ,సోదరులతో పాటు పండుగ జరుపుకునే ప్రతి ఇంట్లో సుఖ సంతోషాలు, ఆనందపు కాంతులు వెదజల్లాలని కోరుకుంటు నట్లు రాజుపాలెం ఎస్సై మని కృష్ణ తెలిపారు .విశ్వ మనవాళిక తన ప్రేమ, తత్వంతో వెలుగులు పంచిన కరుణామయుడైన ప్రేమమూర్తి క్రిస్మస్ పండుగ నాడు మనిషి రూపంలో మన మధ్యకు రావటం ఆనందదాయకమని పేర్కొన్నారు. గురువారం క్రిస్మస్ పండుగ సందర్భంగా మండలం లో పండుగను జరుపుకునే ప్రతి ఒక్క కుటుంబంలో సుఖ సంతోషాలు ఉండాలని ఆయన ఆకాంక్షించారు.